# ఘనంగా అన్నమయ్య సంకీర్తనోత్సవం

అమెరికాలోని సిలికాన్ వేలీలో ఈ నెల 20న సిలికానాంధ్ర సన్నివేల్ దేవాలయం (హిందూ కమ్యూనిటీ సెంటర్) సంయుక్తంగా నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తనోత్సవానికి అపూర్వ స్పందన లభించింది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకూ ఏకధాటిగా సాగిన సంకీర్తనోత్సవం శాస్త్రీయ సంగీతాభిమానులను రసమయ లోకాల్లో విహరింపజేసింది. అన్నమయ్య కీర్తనలను పాడుతూ, నర్తిస్తూ పదకవితా పితామహునికి నివాళిగా రోజంతా ఈ ఉత్సవాలు జరిపారు.

ప్రవేశద్వారం వద్ద నుంచి పలువర్ణాల పతాకాలతో, అన్నమయ్య పదాలు రాసిన బ్యానర్లతో పెద్దలు, పిల్లలు ప్రదర్శనగా లోపలికి వచ్చారు. అన్నమయ్య చిత్రపటాలని వేదోచ్చాటనల మధ్య, సంకీర్తన చేస్తూ ఊరేగింపుగా తీసుకువచ్చారు. దీంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. గడగడ వణికిస్తున్న చలినికూడా లెక్కచేయకుండా పిల్లలు, పెద్దలూ ఈ కార్యక్రమంలో సాంప్రదాయబద్ధంగా పాల్గొనడం విశేషం. అమెరికాలోనే పుట్టి పెరుగుతున్న తెలుగువారి పిల్లలు తమకిది మరువలేని అనుభవమని ఆనందంతో చెప్పారు.

సభా ప్రాంగంణంలో చెరుకుపల్లి గణేష్ శర్మ వేదపఠనంతో శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమాన్ని సిలికానాంధ్ర అధ్యక్షుడు విస్సంరాజు శ్రీఫణి ప్రారంభించారు. అన్నమయ్య పదాలకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు అకుఠింత దీక్షతో శ్రమిస్తామని శ్రీఫణి చెప్పారు. రాబోయే కాలంలో భారత దేశమంతటా ఈ అన్నమాచార్య సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించదలుచుకున్నట్టు ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు కె.వి.రమణాచారి మాట్లాడుతూ అన్నమయ్య కరుణామృతం వర్షిస్తే అది ప్రప్రథమంగా సిలికానాంధ్ర కోసమే అవుతుందని అన్నారు. సిలికానాంధ్ర వారు చె స్తున్న సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన కొనియాడారు.

ఆ రోజు సాయంకాలం భారతదేశం నుంచి అన్నమాచార్య ప్రాజెక్టు నిర్దేశకులు మేడ సాని మోహన్ దూరవాణిలో తమ సందేశాన్ని వినిపించారు. సాంస్కృతిక తపన వల్లె సిలికానాంధ్ర అనేక అసమాన్య విజయాలు సాధించగలుగుతున్నాదన్నారు. అన్నమయ్య కృతులకు స్వరకల్పన చేసే బాధ్యతను సిలికానాంధ్రలకు అంది స్తున్నామన్నారు. కూచిభొట్ల ఆనంద్ మాట్లాడుతూ అఖిల భారత అన్నమాచార్య ఉత్సవానికి దేశవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. అనేక పట్టణాలలో ఇప్పటికే ఈ మేరకు కార్యక్రమాలు రూపుదిద్దుకున్నాయని, రాష్ట్రంలో ప్రతి జిల్లాలో రెండు కేంద్రాల్లో ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

అన్నమాచార్య రాగరాగిణి

అన్నమాయార్య రాగరాగిణి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్ మాట్లాడుతూ మూడేళ్ళుగా సిలికానాంధ్ర దీక్షగా నిర్వహిస్తున్న సంకీర్తనోత్సవాలకు గత ఏడాది ఆంధ్ర రాష్ట్రంలో నిర్వహించిన అఖిలాంధ్ర అన్నమయ్య సంకీర్తనో త్సవాన్ని దృష్టిలో ఉంచుకుని మొట్టమొదటిసారిగా తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు వారు ఒక ప్రవాస సంస్థకు అన్నమయ్య కృతులు స్వరపరిచె బాధ్యతను అప్పగించారని ప్రకటించారు. రాబోయే రెండేళ్ళలో ఈ కృతులు స్వరపరిచి అన్నమయ్య రాగరాగిణి అని పేరిట విడుదల చేస్తామని చెప్పారు.

అన్నమయ్య సంకీర్తన

ఈ కార్యక్రమంలో మొదటగా 40 మంది కళాకారులు అన్నమయ్య సప్తగిరి సంకీర్తనలతో వీనుల విందు చేశారు. ఆ తరువాత 318 మంది గాయనీగాయకులు, నర్తకులు, వాద్యకారులు ఒక్కొక్కరుగా, బందాలుగా అనేక అన్నమయ్య గీతాలు ఆలపించి సభికులను ఆనంద డోలికల్లో ఊగించారు.

ఈ సంకీర్తనోత్సవాలకు హేమకోట, వైజయంతి పుసర్ల నేతృత్వం వహించారు.

శ్రీహరి శాస్త్రి, శ్రీలక్ష్మి కోలవెన్ను, గాయత్రి అవ్వారు తదితరులు వారికి సహాయ సహకారాలు అందించారు. శ్రీలక్ష్మి కోలవెన్ను కృషికి ఆమెని దుశ్శాలువతో, మకుటంతో సత్కరించారు. వంశీ నాదెళ్ళ, నారాయణ రాజులు సమర్థవంతంగా వీడియా చిత్రీకరణ చేశారు. కార్యకర్తలే అందరికీ వండి విందు వడ్డించడం ఈ కార్యక్రమంలో మరో ప్రత్యేకత. దిలీప్ కొండిపర్తి, రవి కూచిభొట్ల, రవి చివుకుల, అనంతరావు, మృత్యుంజయుడు, అన్నం అనిల్ తదితరులు ఏర్పాట్లు చూశారు.

కాలిఫోర్నియా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 1500 మంది ఈ ఉత్సవాలలో ాపాల్గొన్నారు.

ఈ ఉత్సవం కేవలం ఒక రోజుకే పరిమితం కాకుండా కనీసం రెండు రోజులు నిర్వహించాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలు కోరారు. ఈ కార్యక్రమం ద్వారా తమ పిల్లలకు తమ సాంస్కృతిక వారసత్వాన్ని గురించి, తెలుగు భాష గురించి తెలుసుకునే అవకాశం లభించిందని పలువురు తల్లిదండ్రులు అన్నారు.